క్లుప్తంగా

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే


విందులో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రంజాన్ మాసం సందర్భంగా నగరంలోని 5వ వార్డు చిత్తారి వీధిలో ఉన్న హాజీసా మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ పాల్గొన్నారు. మంగళవారం రాత్రి మసీదులో ముస్లిం మత పెద్దలతో కలసి దువా చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాదర్ బాషా, శేషు యాదవ్, అక్బర్, మసూద్, పాల్గొన్నారు.

విందులో పాల్గొన్న ఎస్వీ మోహన్‌రెడ్డి

నగరంలోని 3వ వార్డు ఖురోషి మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ముస్లిం మతపెద్దలతో సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

నేడు మండల మీట్

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 19వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు కర్నూలు మండల అధ్యక్షురాలు ధర్మవరం వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి కర్నూలు ఎంపీ డాక్టర్ సింగరి సంజీవ్‌కుమార్, కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్‌తో పాటు మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు,పంచాయతీ కార్యదర్శులు హాజరుకానున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు, గృహ నిర్మాణాలు, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, ఉపాధిహామీ పథకం,పొదుపు లక్ష్మీ గ్రూపులు, స్త్రీ, శిశు సంక్షేమం, పశు పోషణ, వ్యవసా యం ,విద్య – వైద్యం, కుటుంబ నియంత్రణ, గ్రామ పంచాయతీ – అభివృద్ధి పనులు, మైనర్ ఇరిగేషన్, ఆర్ అండ్‌బీ రోడ్లు, భవనాలు, గ్రామాల్లో తాగునీటి సమస్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు అజెండాలో పేర్కొన్నారు.

30 నుంచి వేసవి శిక్షణా శిబిరం

కర్నూలు కల్చరల్: శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలో ఈ నెల 30వ తేదీ నుంచి ఉచిత వేసవి శిక్షణా శిబిరం నిర్వహించనున్నట్లు సమితి జిల్లా అధ్యక్షుడు మాకా అశోక్‌కుమార్ తెలిపారు. రోజు వారి జీవితంలో ఉపయోగపడే శ్లోకాలు, పిల్లల్లో మానవతా విలువలు పెంపొందించడానికి అవసరమైన కథలు, భారతీయ సంస్కృతికి సంబంధించిన ప్రాథమిక వివరణ, పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలు, పిల్లల్లో శారీరక వికాసానికి అవసరమైన ఆటలు, యోగ, ధ్యానం తదితర వాటిల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు శిక్షణా తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. వివరాలకు 70133 92139, 99080 77277 నంబర్లను సంప్రదించాలన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

కర్నూలు(హాస్పిటల్): రంజాన్ పండుగ పురస్కరించుకుని మంగళవారం స్థానిక మద్దూర్‌నగర్‌లో పేదలకు ప్రజాపరిరక్షణ సమితి అధ్యక్షుడు కె.బలరాం ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. సంపాదనలో కొంత భాగం సేవ కోసం ఉపయోగించాలని ఆయన కోరారు. నాయకులు రవిప్రసాద్, గణపతి, రమణారెడ్డి, రవికుమార్, చౌదరి పాల్గొన్నారు. అలాగే ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని సమాచార భవన్ వద్ద ముస్లిం జర్నలిస్టులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. రంజాన్ ఉపవాసాల పుణ్యఫలంతో కష్టాలు తొలగిపోవాలని ఆకాంక్షించారు.

బీజేపీని గద్దె దించుతాం

కర్నూలు(సెంట్రల్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. ఈనెల 14వ తేదీ నుంచి చేపట్టిన ప్రచార భేరీ కార్యక్రమం మంగళవారం నేతాజీ సర్కిల్ నుంచి కొత్తపేట వరకు కొనసాగింది. సీపీఎం, సీపీఐ నాయకులు ఎస్‌ఏ సుభాన్, ఎం.రాజశేఖర్, మనోహర్ మాణిక్యం, చంద్రశేఖర్, మహేష్ పాల్గొని ఇంటింటా ప్రచార భేరి మోగించారు. మరో బృందం 37, 41వ వార్డుల్లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుంది. నాయకులు టి.రాముడు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

20న చండీహోమం

కర్నూలు కల్చరల్: చైత్ర అమావాస్యను పురస్కరించుకొని స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 20వ తేదీ ఉదయం 9 గంటలకు నవగ్రహ, లక్ష్మీ గణపతి, మూల మంత్ర సహిత చండీ హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి ఉదయం 10 గంటలకు సిందూరార్చన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీకాంప్లెక్స్: శాకుంతలం, దసరా, బలగం , రుద్రుడు, విడుదల పార్ట్–1, రావణాసుర
విమెగాఆనంద్ సినీకాంప్లెక్: విడుదల పార్ట్–1, శాకుంతలం ,రుద్రుడు , మీటర్, దసరా
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : విడుదల పార్ట్–1, రుద్రుడు, శాకుంతలం
ఐనాక్స్: ది పోప్స్ ఎక్సార్సిస్ట్, ది సూపర్ మారియో బ్రదర్స్, విడుదల పార్ట్–1, రుద్రుడు ,జాన్ విక్ చాప్టర్–4, రావణాసుర
భరత్ కాంప్లెక్స్ : పోప్, బలగం, మీటర్
శ్రీరామ : మీటర్
రాజ్ : రావణాసుర
విజయ : మీటర్

కాలేయానికి ముప్పు

- పెరుగుతున్న ఫ్యాటీ లివర్, హెపటైటిస్ రోగుల సంఖ్య
- ఆల్కహాల్ సేవనంతో లివర్ సిరోసిస్
- కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా అత్యాధునిక పరీక్షలు, మందులు
- హెపటైటిస్‌కు రూ.10 వేలు విలువ చేసే మందులు ఉచితం
- నేడు ప్రపంచ కాలేయ దినోత్సవం



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం

కర్నూలు(హాస్పిటల్): మన శరీరంలో ముఖ్యమైన అవయవాల్లో కాలేయం ఒకటి. జీర్ణప్రక్రియలో ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఆహారం సరిగా జీర్ణమయ్యేందుకు, పోషకాలు శరీరానికి అందించేందుకు, వ్యర్థాలు బయటకు పోయేందుకు కాలేయ పనితీరు చాలా ముఖ్యం. అయితే చెడు జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వారసత్వం తదితర కారణాల వల్ల కాలేయం చిక్కుల్లో పడుతోంది. కొన్నిసార్లు కాలేయ మార్పిడికి దారి తీస్తుంది. ఏటా ఏప్రిల్ 19న ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.


కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల జీర్ణకోశ వ్యాధుల విభాగం (గ్యాస్ట్రో ఎంట్రాలజీ)కు 2022లో 722, ఈ యేడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో 126 మంది కాలేయ సమస్యలతో చికిత్స కోసం వచ్చారు. వీరిలో అక్యూట్ హెపటైటిస్ 48, ఆల్కహాల్ కేసులు 539, హెచ్‌బీవీ 121, హెచ్‌సీవీ 36, న్యాష్ 5, ఏఐహెచ్ 4, హెచ్‌సీసీ 19, ఇతర సమస్యలతో 179 మంది చికిత్స కోసం వచ్చారు. అధిక శాతం మంది ఆల్కహాలు సేవించడం, ఆహారపు అలవాట్లు, వంశపారంపర్యం, హెపటైటిస్–బి, సి వైరస్ వంటి ఇన్‌ఫెక్షన్ల కారణంగా లివర్ దెబ్బతినడం వల్ల వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అన్ని రకాల జీర్ణకోశవ్యాధులు, కాలేయ వ్యాధులకు ఉచితంగా అత్యాధునిక వైద్యపరీక్షలు, మందులు అందజేస్తున్నారు. ముఖ్యంగా హెపటైటిస్–బి, సి వ్యాధులకు ఖరీదైన మందులను ఉచితంగా అందిస్తున్నారు.

అవయవాల్లో కెల్లా కాలేయం భిన్నం

మానవ శరీరంలోని అతి పెద్ద గ్రంథి కాలేయం. ఇది జీవక్రియ, రోగనిరోధక శక్తి, జీర్ణక్రియ ప్రక్రియల్లో చురుగ్గా వ్యవహరిస్తుంది. కాలేయం పూర్తిగా దెబ్బతినే వరకు ఎలాంటి సంకేతాలు కనిపించవు. అలాగని అశ్రద్ధ చేస్తే కచ్చితంగా ముప్పు తెచ్చుకున్నట్లే.

కాలేయ వ్యాధి లక్షణాలు

కాళ్ల,చీలమండలాల్లో వాపు,ఆకలిలేకపోవడం,వికారం,వాంతులు, జ్వరం,కామెర్లు,కడుపునొప్పి, మూత్రం రంగులో మార్పు,పొట్టుచుట్టూ దురద,ఎరుపు చర్మం ,మలంలో రక్తం తదితర లక్షణాలు కనిపిస్తే వైద్యులను కలిసి చికిత్సతీసుకోవాలి.రెండు అంతకంటే ఎక్కువ లక్షణాలు ఉంటే తక్షణ వైద్యసహాయం అవసరం.



కాలేయ వ్యాధులు రాకుండా ఉండాలంటే...!

- అతిగా మద్యం, మాంసం, కొవ్వు పదార్థాలు, వేపుళ్లు తీసుకోరాదు
- ఉప్పు, చక్కెర ఎక్కువ మోతాదులో తీసుకోవడం ప్రమాదకరం
- ప్రాసెస్ చేసిన పిండి, ధాన్యాలు తినవద్దు.

ఇలా చేయాలి...

- పచ్చని ఆకుకూరలు లివర్‌ను శుభ్రంగా ఉంచుతాయి.
- సల్ఫర్ ఎక్కువగా ఉండే వెల్లుల్లి, పసుపు కాలేయానికి మేలు చేస్తాయి.
- గ్రీన్‌టీ, ఆపిల్ పండ్లు, ఆలివ్ ఆయిల్, వాల్ నట్స్, అవకాడోలు కాలేయాన్ని శుభ్రం చేస్తాయి.
- విటమిన్–సి పదార్థాలు కాలేయం వద్ద కొవ్వును నియంత్రిస్తాయి.
- నీటిని ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

కాలేయాన్ని దెబ్బతీసే ఫ్యాటీలివర్



కాలేయం చుట్టూ కొవ్వు చేరడం వల్ల ఫ్యాటీలివర్ వస్తుంది. అధికంగా ఆల్కహాలు తీసుకోవడం, ఆహారపు అలవాట్ల కారణంగా వచ్చిన ఫ్యాటీలివర్‌ను త్వరగా గుర్తించి చికిత్స తీసుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే కాలేయం మరింత దెబ్బతినే అవకాశం ఉంటుంది. మద్యం తాగకపోయినా ఫ్యాటీలివర్ సమస్యలు వస్తుంటే నాన్ ఆల్కహాల్ ఫ్యాటీలివర్ డిసీజ్ అంటారు. హెపటైటిస్–బి, సి మందులతో నయం చేసుకోవచ్చు.

–డాక్టర్ వెంకటరంగారెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం హెచ్‌ఓడీ, జీజీహెచ్, కర్నూలు

మద్యం మానేస్తే కాలేయానికి మేలు



ఆల్కహాలు శరీరాన్ని విపరీతంగా డీహైడ్రేట్ చేస్తుంది. కాలేయం శరీరం నుంచి ఈ విషాన్ని తొలగించేందుకు కష్టపడుతుంది. ఆల్కహాలుకు బానిసైన వారు భవిష్యత్‌లో సిర్రోసిస్ సమస్యకు గురవుతారు. అలాగే హెపటైటిస్–బి, సి వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్స్ కూడా ఈ కాలేయ సమస్యకు కారణం. 10 నుంచి 15 సంవత్సరాలకు పైగా ఈ ఇన్‌ఫెక్షన్స్‌తో సతమతమయ్యే వారిలో సిర్రోసిస్ సమస్య కనిపించవచ్చు. ఆరోగ్యకరమైన ఆహారం, మంచి జీవనశైలి, సరైన నిద్ర, మద్యపానం, ధూమపానికి దూరంగా ఉండటం ద్వారా కాలేయాన్ని కాపాడుకోవచ్చు.

–డాక్టర్ పి.అబ్దుల్ సమద్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, కర్నూలు

స్పోర్ట్స్

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): కర్నూలులో ఈనెల 30వ తేదీ నుంచి మే 1, 2 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించి మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర రగ్బీ సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు అన్నారు. మంగళవారం స్థానిక ఆదర్శ విద్యా మందిర్ క్రీడా మైదానంలో జిల్లాస్థాయి రగ్బీ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పి.వి.శారదమ్మ జ్ఞాపకార్థం రాష్ట్ర స్థాయి రగ్బీ జూనియర్ బాల బాలికల చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీలను అవకాశంగా తీసుకొని క్రీడాకారులు ప్రతిభ చాటాలన్నారు. రగ్బీ సంఘం ప్రతినిదులు మహబూబ్ సుభానీ, రవి, మాధవ లక్ష్మీ, రమ్య పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ


కరాటే విన్యాసాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

కర్నూలు(టౌన్):మహిళల ఆత్మరక్షణకు కరాటే వంటి మార్షల్‌ఆర్ట్స్ అవసరమని కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి అన్నారు. మంగళవారం స్థానిక కళాశాల ప్రాంగణంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..చదువుతో పాటు క్రీడల్లో నూ విద్యార్థినులు రాణించాలన్నారు. క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థినులకు కలర్‌బెల్టులు ప్రదానం చేశారు. మాస్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు


కె.మార్కపురంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కె.మార్కపురం గ్రామంలో సర్పంచ్ గణ మద్దిలేటి, నాయకులు దొరబాబు, శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ బోయ శారద, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలో ప్రతి గడపను సందర్శిస్తూ మహిళలు, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే గడప గడపకు వస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు, రాజకీయాలకు, కులాలకు, వర్గాలకు, మతాలకు అతీతంగా అర్హులైన వారందరికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. పలువురు స్థానికులు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.

- ఎస్సీ కాలనీలో సామూహిక మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు.
- గ్రామంలో శ్మశాన వాటిక నుంచి మెయిన్ రోడ్డు వెంట డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మించాలన్నారు.
- రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్‌కు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు.
- గ్రామానికి చెందిన గిడ్డమ్మ, లక్ష్మీదేవి, మాధవి పింఛన్ రావడం లేదని చెప్పగా అర్హతలు పరిశీలించి పింఛన్లు మంజూరు చేయాలని, కాలనీవాసులు లేవనెత్తిన సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు.
- ప్రత్యేక అవసరాలు గల పిల్లల సమస్యలను తల్లిదండ్రులు తెలియజేయగా అవసరమైన వారికి ఆపరేషన్ చేయిస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీఓ రమణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్ర, కృష్ణ, రామతిమ్మారెడ్డి, రామకృష్ణరెడ్డి, హనుమంతురెడ్డిపాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి


దివ్యాంగులకు వాహనాలను అందజేస్తున్న కలెక్టర్ జి.సృజన, ఎమ్మెల్యే జే.సుధాకర్

కర్నూలు(సెంట్రల్): దివ్యాంగుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ జే.సుధాకర్ పేర్కొన్నారు. రూ.1.25 లక్షల విలువ చేసే త్రిచక్ర మోటార్ వాహనాలను ఉచితంగా అందించి వారి ఎదుగుదలకు ప్రోత్సాహం ఇస్తున్నట్లు చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లో కోడుమూరు నియోజకవర్గానికి చెందిన 10 మంది దివ్యాంగులకు త్రిచక్ర మోటార్ వాహనాలను ఆయన కలెక్టర్‌తో కలసి అందజేశారు. కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ.. మోటారు వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని, నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. వికలాంగుల శాఖ ఏడీ విజయ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన


పెట్రోల్‌బంక్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కర్నూలు: పెట్రోల్ బంకుల్లో అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు ఎలా ఎదుర్కోవాలనే అంశంపై అగ్నిమాపక శాఖ సిబ్బంది డెమో ద్వారా అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు కర్నూలు శివారులోని గుత్తి రోడ్డులో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకులో 'డెమో' ద్వారా పెట్రోల్ బంకుల యజమానులకు,అందులో పనిచేస్తున్న సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రమాదం చోటు చేసుకున్నప్పుడు నివారణ చర్యల గురించి 'డెమో' ప్రదర్శి చారు. అగ్నిమాపక శాఖ జిల్లా సహాయ అధికారి చిన్న బజారి పాల్గొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరించాలి

కర్నూలు(సెంట్రల్): సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ వి.గిరకుమార్‌రెడ్డి, కార్యదర్శి కేవై కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కాంటాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నిరాహార దీక్ష చేపట్టారు. నాయకులు నాగరమణయ్య, శోభసువర్ణమ్మ, సూరిబాబు, ప్రతాప్, ఎవీ రెడ్డి, శ్రీనివాసులు, రామానాయుడు పాల్గొన్నారు.

ప్రతి ఆర్‌బీకేలో సీహెచ్‌సీ ఉండాల్సిందే

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని ప్రతి ఆర్బీకేలో వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద కస్టమ్ హయ్యరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హరికిరణ్ ఆదేశించారు. జిల్లాలో 466 ఆర్‌బీకేలు ఉండగా 118 ఆర్‌బీకేల్లో సీహెచ్‌సీల ఏర్పాటు చేయాల్సి ఉందని, ఇందులో 73 ఆర్‌బీకేలకు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. మంగళవారం గుంటూరు నుంచి జిల్లా వ్యవసాయ యంత్రాంగంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీహెచ్‌సీల ఏర్పాటు రబీ పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేయడం, ఆర్‌బీకేల్లో ఎరువులను సిద్ధం చేయడం, ఖరీఫ్ విత్తనాలు, ఎరువుల పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ మరో వారం రోజులు వ్యవధి ఇస్తున్నామని, వంద శాతం ఆర్‌బీకేల్లో సీహెచ్‌సీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఆర్‌బీకే పరిధిలో 20 టన్నుల ఎరువులను నిల్వ చేసేందుకు గోదాములను గుర్తించాలన్నారు. కర్నూలు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్.వరలక్ష్మి, ఏడీఏలు సాలురెడ్డి, మహమ్మద్ ఖాద్రి, గిరీష్, సునీత, విజయమోహన్‌రావు, అగ్రానమీ ఏడీ బాలవర్ధి రాజు తదితరులు పాల్గొన్నారు.

మాతృ మరణాలపై నిగ్గు తేల్చండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన , హాజరైన వైద్యాధికారులు

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య పరీక్షలు, చికిత్స అందిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో వారికి అవసరమైన పోషకాహారం ఇస్తున్నాం. అయినా జిల్లాలో మాతృ మరణాలు ఎందుకు జరుగుతున్నాయి? నిగ్గు తేల్చా లని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. ఆమె మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ అంశాలపై వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. గత రెండేళ్లలో జరిగిన ప్రసూతి మరణాలు, శిశు మరణాలకు సంబంధించి వచ్చే సమావేశంలో నివేదిక సమర్పించాలని ఆదేశించా రు. ప్రతి గర్భిణి వివరాలను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసి సురక్షిత ప్రసవం జరిగేవరకు తగిన చికిత్స, పర్యవేక్షణ చేయాలని చెప్పారు. జిల్లాలో ఫ్లోరోసిస్ ప్రభావిత ప్రాంతాల నివేదికలు ఇవ్వాలని, ఆయా ప్రాంతాల్లో రక్షిత మంచినీరు అందిస్తున్నారా లేదా అనే అంశాలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్యను ఆదేశించారు. నేషనల్ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్, డెఫ్‌నెస్ అండ్ ఓరల్ హెల్త్ ప్రోగ్రామ్‌లకు సంబంధించి గత ఆరు నెలల్లో ఎంత మందిని గుర్తించారు, వారికి ఎలాంటి చికిత్సను అందించారనే నివేదికలు సమర్పించాలన్నారు. గత నాలు గు నెలల్లో జిల్లాలో 160 మలేరియా, డెంగ్యూ కేసు లు నమోదయ్యాయని, సంబంధిత ప్రాంతాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని మలేరియా అధికారి నూకరాజుకు చెప్పారు. జిల్లాలో 1,236 టీబీ కేసులు ఉన్నాయని, ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స చేసేవారికి ప్రోత్సాహక నగదు, టీబీ రోగులకు పోషకాహారం తీసుకునేందుకు నగదును ఇస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం జిల్లాలో పకడ్బందీగా అమలు కావాలని చెప్పారు. 1,255 ప్రభుత్వ పాఠశాలలకు గాను 1,192 పాఠశాలల్లో చదువుతున్న 10–19 ఏళ్ల వయస్సు గల విద్యార్థినులకు హిమోగ్లోబిన్ పరీక్ష నిర్వహించగా 65 శాతం మంది రక్తహీనతతో బాధ పడుతున్నారని, వారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. సచివాలయ పరిధిలో ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్‌పీలు, జాయింట్ సర్వే నిర్వహించి ఎంత మంది విద్యార్థులు డ్రాపౌట్ అయ్యారో సర్వే నిర్వహించాలన్నారు. కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో నాడు–నేడు కింద రూ.500 కోట్లతో మెడికల్ కాలేజ్, ఆసుపత్రి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, ప్రస్తుతానికి రూ.60 కోట్లతో ఐపీ బ్లాక్ పనులు మొదలయ్యాయని సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి కలెక్టర్‌కు నివేదించారు. ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రఘు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రామ్‌జీ నాయక్, ఫ్యామిలీ ఫిజీషియన్ ఆఫీసర్ డాక్టర్ బాలమురళి, ఆర్‌బీఎస్‌కే కో–ఆర్డినేటర్ హేమలత పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీల ఆదాయం పెంపుపై దృష్టి

- జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు


సమావేశంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ సెక్రటరీలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వ్యవసాయ మార్కెట్ కమిటీల ఆదాయాన్ని పెంచేందుకు ఇప్పటి నుంచి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు తెలిపారు. మంగళవారం కర్నూలు మార్కెటింగ్ శాఖ ఏడీ కార్యాలయంలో కర్నూలు, నంద్యాల జిల్లాల మార్కెట్ కమిటీ సెక్రటరీల సమావేశం నిర్వహించారు. 2022–23లో ఆదోని, కోడుమూరు, మంత్రాలయం మార్కెట్ కమిటీలో ఫీజు వసూలులో లక్ష్యాలు సాధించలేకపోయాయన్నారు. కర్నూలు జిల్లాలో గత ఏడాది ఫీజు వసూలు లక్ష్యం రూ.30.52 కోట్లు ఉండగా... రూ.25.55 కోట్లు మాత్రమే వచ్చిందని పేర్కొన్నారు. 2023–24లో మార్కెట్ కమిటీల ఆదాయం దారి మళ్లకుండా ఇప్పటి నుంచి నిఘా ఉంచాలన్నారు. చెక్‌పోస్టులను మరింత బలోపేతం చేయాలని సూచించారు. కర్నూలు, నంద్యాల జిల్లాలకు రెండు ప్రకారం విజిలెన్స్ టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీడీఎం లావణ్య, ఏడీఎం నారాయణ మూర్తి, కర్నూలు, ఆదోని, నంద్యాల, కోడుమూరు, ఆళ్లగడ్డ, డోన్, ఎమ్మిగనూరు తదితర మార్కెట్ కమిటీల సెక్రటరీలు పాల్గొన్నారు.

షాపులు దక్కించుకునేందుకు పోటాపోటీ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో బయటి వైపు (పంప్‌హౌస్ రోడ్డుకు) నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలు దక్కించుకునేందుకు వేలంపాటలో తీవ్ర పోటీ నెలకొంది. మంగళవారం సాయంత్రం యార్డులోని ఇస్కాన్ భోజన శాలలో 15 షాపులను కేటాయించేందుకు వేలంపాట నిర్వహించారు. వేలంపాటలో పాల్గొనేందుకు దాదాపు 250 మంది దరఖాస్తులు కొనుగోలు చేయగా 217 మంది డిపాజిట్ రూపంలో రూ.50 వేలు డీడీ రూపంలో చెల్లించి వేలంపాటలో పాల్గొన్నారు. మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలంపాట జరిగింది. 1– 7 షాపుల వరకు సర్కారువారి పాట రూ.11,154 ఉండగా రూ.35 వేల నుంచి రూ.42,200 వరకు పలికాయి. 8 నుంచి 15వ నంబరు షాపులకు సర్కారు వారి పాట రూ.3,960గా నిర్ణయించగా వేలంలో రూ.25,100 నుంచి రూ.35 వేలకు పలికింది. ఈ మొత్తం నెల బాడుగ చెల్లించాల్సి ఉంది. ఏడాదికి 5 శాతం బాడుగ పెంచుతారు. వేలంపాటలో షాపులు దక్కించుకున్న వారు 5 ఏళ్ల వరకు నిర్వహించుకోవచ్చని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు తెలిపారు.

పోలీసులను చూసి పారిపోతుండగా ప్రమాదం

కర్నూలు: రోడ్డుపై పోలీసులను చూసి తప్పించుకుని పారిపోయే ప్రయత్నంలో ఇద్దరుయువకులు ప్రమాదానికి గురయ్యారు. కర్నూలు మండలం బి.తాండ్రపాడుకు చెందిన ఎల్లప్ప ఓ ప్రైవేటు పాఠశాలలో సెక్యూరిటీ గార్డు కాగా వంశీ అటెండర్‌గా పనిచేస్తున్నాడు. వీరు మంగళవారం బైక్‌పై తెలంగాణకు వెళ్లి మద్యం తాగి తిరిగి కర్నూలుకు వస్తున్నారు. కర్నూలు శివారులోని సుంకేసుల రోడ్డులో గాంధీ టవర్స్ వద్ద రెండవ పట్టణ పోలీసులు వాహన తనిఖీ నిర్వహిస్తున్నారు. అటుగా బైక్‌పై వస్తున్న ఎల్లప్ప, వంశీ పోలీసులను చూసి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారని, పట్టుబడితే జైలుకెళ్లాల్సి వస్తుందని భావించి ఉన్నఫలంగా వాహనాన్ని యూటర్న్ తిప్పడంతో వెనుక వచ్చిన ఆటో ఢీకొట్టింది. ఇరువురూ కింద పడ్డారు.ప్రమాదంలో ఎల్లప్పకు కాలు విరగగా వంశీ తలకు గాయాలయ్యాయి. ఇరువురూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కార్యవర్గం ఎన్నిక

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా సురేష్ బాబు ఎంపికయ్యారు. మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశం అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా జయమణి, పలువురిని ఎంపిక చేసినట్లు అధ్యక్షుడు తెలిపారు.